సూపర్ సిక్స్ కోసం ఎదురుచూపు

● మేనిఫెస్టోలోని హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
● చంద్రబాబు తీరుపై ప్రజల ఆగ్రహం



సార్వత్రిక ఎన్నికల సమయంలో దెందులూరు సభలో హామీలిస్తున్న చంద్రబాబు, చింతమనేని

దెందులూరు: సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 100 రోజుల పాలనలో చేసింది ఏమీ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధినేతే అనుకుంటే కూటమి తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో అలవికాని వాగ్దానాలను ప్రజలకు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక నిధుల లేమి సాకుతో వాటిని నెరవేర్చే విషయం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఊరు వాడ ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థిక సాయం, అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా అందజేస్తామన్నారు. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తామని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు రూ.1,500 ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఇలా మేనిఫెస్టోలో పలు హామీలిస్తూ భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పనుల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. అయిన వారికి సాయం అందించలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకానికి అతీగతీ లేదు. చంద్రబాబు పాలనా తీరుపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పింది, చెప్పినట్లుగా పక్కాగా పథకాలను అమలు చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే పథకాలను కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గం వారీగా వివరాలు

పథకం	లబ్ధిదారులు	అందాల్సిన లబ్ధి
అన్నదాతకు సాయం	15,059	రూ.301.18 కోట్లు
అమ్మకు వందనం	35,000	రూ.525 కోట్లు
నెలకు రూ.1,500	45,000	రూ.675 కోట్లు
నిరుద్యోగ భృతి	98,000	రూ.96 కోట్లు

నిరుద్యోగ భృతి ఏమైంది?



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలతో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. నేను ఎంఏ బీఈడీ చేశాను. కూటమి అధికారంలోకి వచ్చి 50 రోజులైనా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాల కల్పన ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇవ్వకపోతే వారి ఆగ్రహానికి గురికాక తప్పదు.
– కట్టా ఏసుబాబు, దెందులూరు

హామీలు అమలు చేయాలి



మూడు నెలలైనా నెలకు రూ.1,500 ఇప్పటి వరకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయ్యింది. ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి నాయకులు, ఇంటింటా, వీధి వీధిన, ఊరూ వాడ రూ.1,500 మహిళలకు ఇస్తామని ఊదరగొట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ ఊసేలేదు. మహిళలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ అమలు కోసం ఎదురు చూస్తున్నారు.
– నాగమణి, పెదవేగి

అప్పు చేసి సాగు చేస్తున్నాం



రైతులను మరోసారి కూటమి నాయకులు దగా చేశారు. ఎన్నికల్లో... ఎన్నికల ముందు అనేక హామీలతో కూడిన రంగురంగుల బ్రోచర్లు పట్టుకుని ఎవరికి తోచినట్లు వారు అన్నదాతకు సాయం చేస్తామంటూ ఊదరగొట్టారు. ఒక్కొక్క రైతుకు రూ. 20 వేలు వేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వందరోజులైంది. రైతులకు ప్రభుత్వ సాయం లేదు. రైతులు అప్పులు చేసుకుని సాగు చేస్తున్నారు.
– అయినంపూడి రాము, సత్యనారాయణపురం

క్లుప్తంగా

ఊక లోడు లారీ బోల్తా



దెందులూరులో శ్రీశైనికుల వీధిలో బోల్తా కొట్టిన ఊక లారీ లోడు

దెందులూరు: కొవ్వలి- దెందులూరు మెళుతున్న ఊకలోడు లారీ శ్రీ శైనికుల వీధిలో శుక్రవారం బోల్తా కొట్టింది. శ్రీశైనికుల వీధిలో మలుపు, మలుపు నుంచి ఎన్‌టీఆర్ బొమ్మకు వెళ్లే రోడ్డులో రోడ్డు బాగా ఇరుకుగా ఉండటం గమనార్హం. ఊక లోడు లారీ బోల్తా కొట్టడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత



వరదరాజపురంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం వరదరాజపురంలో 104 వైద్యశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గుడ్‌ల్యాంప్ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రసులపై వివక్ష చూపరాదని, వారితో కలిసిమెలిసి జీవించడం ద్వారా వారిలో మానసిక స్థైర్యాన్ని కల్పించాలని విల్సన్ సూచించారు. ఈసమావేశంలో గుడ్ ల్యాంప్ ప్రతినిధులు పి.సాగర్, సభ్యులు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



జల్లికాకినాడలో మొక్కలు నాటుతున్న పంచాయతీ సిబ్బంది

గణపవరం: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తద్వారా మానవాళికి రక్షణ కలుగుతుందని పలువురు అన్నారు. శుక్రవారం గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ఖాళీ స్థలాలు, పంచాయతీ స్థలాలు, పంచాయతీ చెరువు గట్లు, పుంతలు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జల్లికాకినాడ, వెంకట్రాజపురం, వలూరు, వాకపల్లి, కాశిపాడు తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



భీమడోలు వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది, చిత్రంలో ఎంపీడీవో

భీమడోలు: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం, భీమడోలు సచివాలయం వద్ద ఆరోగ్య శిబిరాలను ఆమె సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలోని పిచ్చిమొక్కలు, చెత్త చెదారాలు, తుప్పలను తొలగించారు. అమ్మ పేరుతో ఎంపీడీవో మొక్కలు నాటారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు.

ఉపాధ్యాయుడిపై వారంలోగా రిపోర్టు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పెదవేగి మండలం కె.గార్డెన్స్ ఎంపీపీఈ స్కూల్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న బి.సత్యప్రసాద్ 2019 ఆగస్టు 1 నుంచి విధులకు గైర్హాజరవుతూ నేటి వరకు ఆయన ఎక్కడ ఉన్నది వివరాలు తెలియడం లేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన గురించి విచారణ చేసిన పెదవేగి మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం 2021 ఏప్రిల్ 15వ తేదిన చివరి సారిగా షోకాజ్ నోటీసు జారీ చేసినా అది ఆయనకు చేరలేదన్నారు. ఈ మేరకు ఏపీఈసీఎస్‌సీసీ (ఏ) నిబంధనలు అనుసరించి అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారని ఈ ప్రకటన విడుదలైన 7 రోజుల్లో ఆయన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులో రిపోర్టు చేయడంలో సత్యప్రసాద్ విఫలమైతే తదుపరి నోటీసులు లేకుండా వారిని సర్వీసు నుంచి తీసివేస్తామని స్పష్టం చేశారు.

హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా గంజి నిలోత్పల్



గంజి నిలోత్పల్

దెందులూరు: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా దెందులూరు గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ గంజి వెంకట్రావు, సువర్చల దంపతుల కుమారుడు నిలోత్పల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. నిలోత్పల్ హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో న్యాయ విద్య కోర్సును పూర్తి చేశారు. ఆయన నియామకం పట్ల విద్యా, న్యాయ, ఆధ్యాత్మిక, వైద్య, సేవా, కళా రంగాల్లో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు: నారాయణపురంలో సర్పంచి దిడ్ల అలకానంద ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దీనిపై ర్యాలీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పంచాయతీ పాలక వర్గ సభ్యుల, కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

దెందులూరు: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి కృషితో విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని దెందులూరు ఎంఈఓ-1 ఎవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీతంపేట, కొమిరేపల్లి, సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య, రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యుత్, స్టోర్ రూమ్ సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

పీహెచ్‌సీల్లో నిలిచిన అన్ని రకాల వైద్యసేవలు



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట దీక్షల్లో పాల్గొన్న పీహెచ్‌సీల డాక్టర్లు

దెందులూరు: అన్ని పీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల భవిష్యత్, హక్కులు కాలరాసే విధంగా ఇచ్చిన జీవోను నిరసిస్తూ ఏపీపీహెచ్‌సీల జూనియర్ డాక్టర్లు అసోసియేషన్ సమ్మెను ప్రారంభించారు. సమ్మెలో భాగంగా శుక్రవారం అన్ని పీహెచ్‌సీల్లో వైద్యసేవలు నిలుపుదల చేశారు. జూనియర్ డాక్టర్లందరూ ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లి డీఎంఅండ్‌హెచ్‌ఓకు యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట దీక్షలు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల భవిష్యత్, అభివృద్ధి పరిగణనలోనికి తీసుకుని ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోకపోతే జూనియర్ డాక్టర్లందరూ సమ్మెను ఉధృతం చేస్తామని ఏపీ పీహెచ్‌సీల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పూర్ణచంద్ర అన్నారు. దీక్షల్లో వైద్యాధికారులు ప్రవీణ్, పవన్, నాయక్, రోజ్‌మేరీ, చైతన్య ఉన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి



దుద్దేపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: రైతులు సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దుద్దేపూడిలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా రైతులతో ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన మెలకువలను రైతులతో చర్చించి వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఎలుకల నివారణ మందును చిన్న పొట్లాలుగా చేసి రైతులకు అందించారు. మండల వ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామాల్లోని ఎలుకల కన్నాలను గుర్తించామన్నారు. ఈనెల 21న శనివారం అన్ని రైతు సహకార సొసైటీల్లో రైతులకు మందును అందిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతు శాస్త్రవేత్తల పనితీరు భేష్



అమ్మపాలెంలో వరి కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మెక్సికో బృందం

పెదవేగి : రైతు సాధికార సంస్థ రూపొందించిన రైతు శాస్త్రవేత్తల కోర్సు, శాస్త్రవేత్తల పనితీరు అద్భుతమని మెక్సికో ప్రతినిధి బృందం ప్రశంసించింది. సాధారణ రైతు కుటుంబాల నుంచి యువతీ యువకులను ఎంపిక చేసి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం వినూత్న విధానం అని కితాబునిచ్చింది. తమ మూడు రోజుల పర్యటనలో భాగంగా మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ నేతృత్వంలో మెక్సికో ప్రతినిధి బృందం శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల్లో పాలుపంచుకొంది. మెక్సికో బృంద సభ్యులు పెదవేగి మండలంలోని అమ్మపాలెంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లతో ముచ్చటించారు. కోర్సు విధి విధానాలను, కోర్సులో నేర్చుకొన్న మెలకువలను, విజ్ఞానాన్ని వ్యవసాయ సాగుకు అనుసంధానించే విధానం, శాస్త్రవేత్తల రోజువారీ విధులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 29 మంది రైతులు కలిసి సమష్టిగా 32 ఎకరాల విస్తీర్ణంలో ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న వరి పంటను పరిశీలించారు. మెంటార్‌గా పనిచేస్తున్న రైతు కటారు రంగయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ అధికారులు అరుణ, సురేష్, మధు ప్రీతి, సరోజ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతా రావు, అదనపు మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులు



భీమడోలులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఏ.భాస్కర్‌కుమార్

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మండల పరిధిలోని అండర్ 14, అండర్ 17 విభాగాలకు చెందిన క్రీడాకారులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను భీమడోలు ఎంఈవో 1 అయినపర్తి భాస్కర్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 260 మంది క్రీడాకారులు పాల్గొని సత్తాను చాటారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, యోగా, చెస్, షటిల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, పీడీలు సోమశేఖర్, కృష్ణారావు, రాహుల్, ప్రసాద్ తదితరులు ఆటల పోటీలను పర్యవేక్షించారు.

సినీ నటుడు అక్కినేనికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్) : సినీ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సినీ రంగాభివృద్ధికి ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ సంఘ సభ్యులు శ్రీహరికోటి తన గాత్రంతో అక్కినేని నటించిన అనేక సినిమాలలోని ఘంటసాల గానం చేసిన పాటలను ఆలపించి శ్రోతలను ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరంలోని ప్రసిద్ధ గాయకులు వై.అర్జునరావు, పి.సూర్య ప్రకాష్, ఎస్‌వీవీఎస్ ప్రసాద్, గౌరవఅధ్యక్షులు వీవీవీ హనుమంతరావు, ఉపాధ్యక్షులు వడ్లపట్ల నారాయణరావు, ఎం.శివరామ కృష్ణారావు, పలువురు అక్కినేని నాగేశ్వరరావు అభిమాలు పాల్గొన్నారు.

బాధిత బాలికలకు సత్వర న్యాయం చేయాలి

దెందులూరు: ఏలూరు ఆశ్రమంలో వార్డెన్ వల్ల చిత్ర హింసకు గురైన బాధితులందరికీ ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తక్షణ సాయం అందించాలని దెందులూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి గొల్లా వీరాస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం కొవ్వలిలో వారు మాట్లాడుతూ ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వారి పేదరికాన్ని ఆసరాగా తీసుకుని వేధింపులకు గురిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ, బీసీ, మహిళా కమిషన్లు, రాష్ట్ర హైకోర్టు మానవహక్కుల కమిషన్ సుమోటోగా ఏలూరు ఆశ్రమం బాధిత బాలికల సంఘటనపై కేసు విచారణ చేపట్టాలని కోరారు. రిటైర్డ్ జడ్జితో న్యాయవిచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్‌కు విరాళం

దెందులూరు: సమాజంలో అందరితో పాటు ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ సేవలు తమను ఆకట్టుకున్నాయని, దెందులూరు రిటైర్డ్ టీచర్లు ఎం.వెంకట్రాది, లక్ష్మీకుమారి అన్నారు. శుక్రవారం దెందులూరులో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రతినిధులు జరజాపు రంగారావు, బీవీ రమణమూర్తి, చుక్కా అవినాష్‌రాజు చేస్తున్న సేవలకు తమవంతు సాయంగా రూ. 10 వేలను అందిస్తున్నామన్నారు. రిటైర్డ్ టీచర్లకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలి



మొక్కలు నాటుతున్న సెట్ వెల్ సీఈవో ప్రభాకరరావు, విద్యార్థులు

ఉంగుటూరు: సహజంగానే తెలివితేటలున్న ఈ జనరేషన్ యువకులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారిస్తే వాటిని సులభంగా సాధించవచ్చని సెట్ వెల్ సీఈవో ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసులు, ఉపాధి ఉద్యోగు కల్పనా విభాగం సంయుక్తంగా విద్యార్థులకు కెరియర్ కౌన్సెలింగు పర్సనాలిటీ డవలప్‌మెంటుపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మనలో ఉన్న బలాలు, బలహీనతలు అంచనా వేసుకుని బలహీనతలను అధిగమించాలని సూచించారు. జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి మదుసూధనరావు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాలు సాధించే నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సెట్ వెల్ మేనేజరు కెనడీ, టూరిజం మేనేజరు పట్టాబి, వైస్ ప్రిన్సిపాల్‌డి రెడ్డయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టరు కొండారవి, అధ్యాపకులు బాబూరావు పాల్గొన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కళాశాల పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు.

సర్పంచుల హక్కులను కాపాడాలి

దెందులూరు: శ్రీరామవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ అజెండా తయారుచేసిన లేఖను తీసుకోవడం లేదని దీనికి సంబంధించిన రశీదు సైతం ఇవ్వనని చెబుతున్నారని ఇదెక్కడి న్యాయమని, సర్పంచుల హక్కులను కాపాడాలని ఉన్నతాధికారులను కోరానని శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీరామవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించడానికి తేదీ, అజెండా ఖరారు చేయమని వాట్సాప్, రిజిష్టర్ పోస్టు ద్వారా పంపారన్నారు. దానిపై తాను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తయారుచేసిన అజెండా లెటరును పంచాయతీ కార్యదర్శి దాసుకి పంపించినట్టు తెలిపారు. రశీదు ఇవ్వకపోతే గ్రామ సర్పంచ్‌గా నేను అజెండా ఇచ్చినట్లు ఆధారం ఉండదని, గ్రామ కార్యదర్శి ఈ తరహాగా వ్యవహరించడం విచిత్రంగా ఉందని, నేను తయారు చేసిన అజెండా లెటరును పరిశీలించాలని, సర్పంచుల హక్కులను కాపాడాలని ఎంపీడీఓ వి.శ్రీలతను కోరారు.
ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ అడగగా తాను అజెండా లెటర్ తీసుకోమని గ్రామ కార్యదర్శికి చెప్పానన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసు మాట్లాడుతూ సర్పంచ్ కామిరెడ్డి నాని ఒక వ్యక్తితో అజెండా లెటర్ పంపించిన సంగతి వాస్తవమేనని, ఆ లెటర్‌ను నేను తీసుకులేదన్నారు. రశీదు ఇవ్వనని చెప్పడం వాస్తవమేనని, వేరే వ్యక్తికి రశీదు ఎలా ఇస్తానని ఆయన అన్నారు.

ఆక్వా సాగు పరిశీలన



కేశవరంలో చేపల సాగుపై వివరాలు తెలుసుకుంటున్న ఒడిశా మత్స్యశాఖ విద్యార్థులు

గణపవరం: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో విస్తారంగా ఉన్న ఆక్వా సాగు, పాటించాల్సిన మెలుకువలను తెలుసుకోవడానికి ఒడిశాకు చెందిన మత్స్యశాఖ విద్యార్థులు గణపవరం మండలంలో పర్యటించారు. మండలంలోని కేశవరం, అర్ధవరం జిల్లాల్లో సుమారు 22 మంది విద్యార్థులు పర్యటించారు. రైతుల నుంచి సాగు పద్ధతులు, మేతల వినియోగం, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఒడిశా ప్రభుత్వం నూతన సాంకేతిక సిబ్బందిని మత్స్యశాఖలో నియమించింది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న ఆక్వా సాగుపై అవగాహన పొందడానికి వచ్చినట్లు టీం కోఆర్డినేటర్ మనోరంజన్ మహాపాత్ర తెలిపారు. కార్యక్రమంలో గణపవరం మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ, మత్స్యశాఖ అసిస్టెంట్ షర్మిల, ఆక్వా రైతులు సీతారామరాజు, రమేష్‌రాజు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో 84 వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు సర్దుబాటు చేయడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కారణమైన జీవో 84ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగరశాఖ ప్రధాన కార్యదర్శి అబ్బుదాసరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ ఏలూరు నగరశాఖ సమావేశం స్థానిక సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో కురమ ఆనంద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ తొమ్ముండ్రు ప్రకాష్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు మాట్లాడుతూ సర్దుబాటులను మండల స్థాయిలో చేయవలసి ఉండగా ప్రభుత్వం ఏకపక్షంగా ఉపాధ్యాయులను డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సర్దుబాటులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్లు జె.శాంతి కుమార్, పి.రోజా, కె.పాట్టియ్య, సీహెచ్ వెంకటరత్నం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మండలంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మహేశ్వర కాలనీలో 21 శనివారం వినాయక నిమజ్జనం చేయనున్న కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీ, మహేశ్వరకాలనీ, వంగాయగూడెం, కైకలూరు బైపాస్ రోడ్డు, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాలలో సాయంత్రం 4.00 గంటల నుంచి నిమజ్జనం ఊరేగింపు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.